నినాదం నిఖార్సైన జర్నలిజం
సాహితీ లహరి
శనివారం, ఫిబ్రవరి 21, 2026



# మాతృభాషల పరిరక్షణ... మనందరి బాధ్యత

## తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య పిల్లలమర్రి రాములు

**హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం**

హైదరాబాద్, (నినాదం):

ప్రపంచీకరణ సాంకేతిక విప్లవ యుగ నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా మాతృభాషలను పరిరక్షించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య పిల్లలమర్రి రాములు పేర్కొన్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలోని తెలుగుశాఖ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ వేడుకలకు ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. మాతృభాష కోసం ప్రాణాలర్పించిన విద్యార్థులకు నివాళులర్పిస్తూ సుమారు ఏడున్నర దశాబ్దాల క్రితం ఢాకా విశ్వవిద్యాలయ విద్యార్థులు మాతృభాష సంరక్షణ కోసం ఉద్యమం నిర్వహించి ప్రాణాలర్పించారని ఆనాటి చారిత్రక అంశాలను వివరించారు.. ఈ సందర్భంగా ఆయన స్వయంగా రాసి ఆలాపించిన తెలుగు భాష జయ గీతం సభలోని వారందరిని ఎంతగానో ఆకట్టుకుంది.



**ఆచార్య పమ్మి పవన్ కుమార్ మాట్లాడుతూ...**

ప్రపంచంలో క్రమంగా అనేక భాషలు అంతరించిపోతున్న సమయంలో వాటిని కాపాడుకోవడం కోసం జరుపుతున్న ప్రయత్నాలను గూర్చి వివరించారు. ఈ ఏడాది అంతర్జాతీయ మాతృభాష దినోత్సవానికి యునెస్కో ప్రతిపాదించిన నినాదం 'బహుభాషల విద్య: యువత అభిప్రాయాలు" (Youth voice on multilingual education) అని అన్నారు. త్రిభాషా సూత్రాన్ని అనుసరించి ప్రాంతీయ భాష, జాతీయ భాష, అంతర్జాతీయ భాషల ద్వారా విద్యాభ్యసనం అనివార్యం కావడం వల్ల మాతృభాషల మనుగడ కొనసాగుతుందని అన్నారు. కాని యునెస్కో గణాంకాల ప్రకారం దేశీయభాషలు అంతరిస్తున్నాయని హెచ్చరికలు వినిపిస్తున్నాయి. దీనికి మూల కారణం మధ్య యుగాలలో ఏర్పడిన అస్థిర రాజరిక పాలనా వ్యవస్థ అని వివరించారు. భాషలను చరిత్ర, సమాజం, సంస్కృతి, ఆర్థికం, పాలన వంటివి ప్రభావితం చేస్తాయని అన్నారు. అమెరికాలోని భాషా ప్రముఖులు మల్టీ లింగ్వల్ గా ఆంగ్ల భాషను ఉపయోగించుకుంటున్న విషయాన్ని ప్రస్తావించారు. బహుభాషల వ్యవహారంగా అమెరికా యాక్షన్ ప్లాన్ ను సిద్ధం చేసిందని అన్నారు. భావోద్వేగభాషగా తెలుగును మనం తరువాతి తరాలకు అందిస్తూనే శాస్త్రీయంగా భాషను సంరక్షించుకోవాలని సూచించారు. ఆయా జాతులకే పరిమితమైన ప్రత్యేక అస్తిత్వం, ఉనికి గల భాషను ఎలా కాపాడుకోవాలో వివరించారు. రాజ్యాంగ భాషా నిర్దేశాల ప్రకారం లిపి వ్యవహారం లేని మాతృభాషలు ప్రమాదంలో ఉన్నాయని అన్నారు. అందులో ముఖ్యంగా బోయ, కొండ, గోండు, కోయ, సవర భాషల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. కాలానుగుణంగా సాంకేతిక వనరుల తోడ్పాటుతో భాషలను పునరుజ్జీవింపజేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రపంచంలో మన మాతృభాష తెలుగుకు మంచి స్థానం ఉందని గుర్తు చేశారు. ఈ విషయంలో వికీపిడియా వంటి అనేక ప్రాజెక్ట్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. దేశీయ భాషోత్సవాల సందర్భంగా మౌఖికంగా, లేఖనంగా భాషను పునరుద్ధరించుకోవాలని, అవసరమైతే కొత్త భాషలను సృష్టించుకోవాలని విద్యార్థులకు సూచనలు చేశారు.



**ఆచార్య డి. విజయలక్ష్మి మాట్లాడుతూ...**

భాషలప్రాధాన్యతను కోల్పోకుండా తమ తమ భాషల ఔన్నత్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత నేటితరంపై ఉందన్నారు. తూర్పు పాకిస్థాన్ – బంగ్లాదేశ్ లో భాష సమాన హోదా కోసం జరిగిన ఉద్యమం ప్రపంచాన్ని కుదిపేసిందని అన్నారు. ఢాకా విశ్వవిద్యాలయం విద్యార్థుల ఆత్మ గౌరవ భాషా పోరాటం, ప్రాణత్యాగం పర్యవసనాల నేపథ్యంలో ప్రపంచంలోని అన్ని మాతృభాషలు సంరక్షింపబడాలని యునెస్కో ప్రతి సంవత్సరం మాతృభాషా పరిరక్షణ కార్యక్రమాలను చేపడుతుందని అన్నారు. ఈ క్రమాన్ని ఒకసారి అనుశీలిస్తే భాష అనేది చారిత్రక, సాంస్కృతిక, భౌగోళిక, నైసర్గిక నేపథ్యంతో కూడుకొని ఉందన్నారు. అందుకు అనుగుణమైన కొన్ని ఉదాహరణలు ప్రస్తావిస్తూ ఆయా వృత్తులు, సంచార వృత్తుల్లో శబ్ద సంపద, పద విస్తృతి అనంతంగా ఉందని అన్నారు. సూక్ష్మ దృష్టి ద్వారా, దేశీయ జీవన వ్యవహారాల ద్వారా భాషను పరిరక్షించుకోవచ్చని తెలియజేశారు.



**డా. బాణాల భుజంగరెడ్డి మాట్లాడుతూ...**

మాతృభాషల అభివృద్ధిలో మన కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధిని కొనియాడారు. మాతృ భాషల అభివృద్ధికి అభిప్రాయాల సేకరణతో పాటు అభివ్యక్తి ప్రధానమని అన్నారు. 2008 యునెస్కో గణాంకాల రికార్డుల ప్రకారం ఏడు వేల భాషలు అంతరించే స్థితిలో ఉన్నాయని అన్నారు. కానీ ఆయా భాషల మనుగడ కోసం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అనేక కార్యక్రమాలు చెప్పుకోదగ్గవని ప్రస్తావించారు. ప్రాంతీయ భాషా వ్యవహారాల్లో గల సామాజిక సాంస్కృతిక పురోభివృద్ధి కోసం నూతన విద్యా విధానం (NEP), జాతీయ కేంద్ర గ్రంథాలయాలు (NCL), భారతీయ భాషాభివృద్ధి సంస్థ (CIIL), జాతీయ అనువాద సంస్థ (NTS), జాతీయ తాళపత్ర సంస్థ (NMS), కేంద్ర సాహిత్య అకాడమీ, ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం, దక్షిణ ప్రాదేశిక భాషల అభివృద్ధి సంస్థ వంటివి ఎంతగానో కృషి చేస్తున్నాయని అన్నారు. పాఠ్యపుస్తకాల నిర్మాణం, అనువాద గ్రంథాల రచనలు, పురస్కారాల ప్రదానం చేసి ప్రోత్సహిస్తున్నాయని అన్నారు. ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి కోర్సులకు సంబంధించి వర్క్ షాప్స్ నిర్వహిస్తూ పద వ్యుత్పత్తి కోసం ప్రయత్నం చేస్తుందని అన్నారు. మాతృభాషల విస్తృతిలో సామాజిక మాధ్యమాల సేవ అంతా ఇంతా కాదని కొనియాడారు.



**ఆచార్య భూక్య తిరుపతి మాట్లాడుతూ...**

బంజారాభాషలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి అబ్బురపరిచారు. ఏ ఇతర భాషలోనైనా ప్రసంగం గాని, పాఠ్యభాగం గాని విన్నా మొదటగా మాతృభాషలోనే అర్థస్ఫురణకు కలుగుతుందని అన్నారు. ప్రపంచంలో అంతరించిపోతున్న భాషల్లో గిరిజన భాషలు ఎక్కువగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మనదేశంలో 40 శాతం గిరిజన భాషలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని అన్నారు.

కానీ కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అస్మిత ప్రాజెక్ట్ భాషా సంరక్షణ కోసం పాటుపడుతుందని అన్నారు. చివరగా మాతృభాష ఒక అక్షయపాత్రగా అభివర్ణించారు. ఈ కార్యక్రమానికి స్వాగతం డాక్టర్ డి. విజయ కుమారి పలకగా, వందన సమర్పణ డాక్టర్ పి. విజయకుమార్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య పి. వారిజా రాణి, ఆచార్య వంగరి త్రివేణి, పరిశోధకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.





## తెలుగు భాష గొప్పతనం

తెలుగు అంటే ఒక వెలుగు
అమ్మ భాష తెలుగుభాష
కమ్మనైన భాష తెలుగు
అమ్మ నేర్పిన అమ్మ భాష తెలుగు!!

తీయనైన భాష తెలుగు భాష
అమ్మ ఒడిలోన పలికే తెలుగు భాష
తెలుగు భాష పాటల ఊట
సకల కళలకు పూదోట తెలుగు భాష!!

నలుగురు మెచ్చే నా తెలుగు భాష
బహు చక్కనైన నా తెలుగు భాష
అందరినీ ఒక్కటి చేసే నా తెలుగు భాష
ఆత్మగండ్ల భాష నా తెలుగు!!

స్వచ్ఛమైన తెలుగు భాష
అందమైన మన తెలుగు భాష
సంస్కృతి సాంప్రదాయాలకు
నిలయం తెలుగు భాష
అందమైన ప్రపంచంలో
అందమైన భాష తెలుగు!!

అమృతం లాంటి అమ్మ భాష తెలుగు
ఆనందాన్ని ఇచ్చే తెలుగు భాష
ఆత్మ బంధువు లాంటి భాష తెలుగు
వెన్నెల లాంటి వెలుగునిచ్చే తెలుగు
భాష అవని లో అమ్మ భాష గొప్పది!!

రచన
దేవులపల్లి రమేష్,
కలం : వామిక శ్రీ
నంగునూర్, సిద్దిపేట
9963701294.



# మారిషస్ లో తెలుగు వెలుగు

ఆఫ్రికా ఖండ తీర ఆగ్నేయ తీరప్రాంతాల్లో 2000లో మీటర్ల దూరంలో హిందూ మహా సముద్రంలో ఉన్న ద్వీప దేశం మారిషస్. 2040 చ.కి.మీల వైశాల్యం కలిగి, పోర్టు లూయిస్ రాజధానిగా దాదాపు 12 లక్షల పై చిలుకు జనాభా కలిగి, ఆంగ్లం, తెలుగు అధికార భాషలుగా, మారిషియన్ క్రియోల్, ఫ్రెంచి, చైనీస్ ఉర్దూలతో పాటు, భోజ్ పూరి, మరాఠీ, తమిళం, ఉర్దూ తదితర భారతీయ ప్రాంతీయ భాషలు గా కలిగి ఉంది. 1630 – 1710 డచ్ కాలనీగా 1715 – 1810 మధ్య ఫ్రెంచ్ కాలనీగా తర్వాత 1968 వరకు బ్రిటిష్ కాలనీల నుండి తర్వాత స్వాతంత్రం పొందింది. 1903లో పైచెల్లిసును ప్రత్యేక కాలనీ గా రూపొందించిన తర్వాత మారిషస్ క్రమానుగత అభివృద్ధి జరుగు తున్నది. ఆఫ్రికా దేశాల మానవ అభివృద్ధి జాబితాలో ద్వితీయ స్థానంలో ఉన్న మారిషస్ హిందూ యిజం అతి పెద్ద మతంగా ఉన్న ఏకైక ఆఫ్రికా దేశంగా ప్రత్యేకతను కలిగి ఉంది.

రైతులు చెరకు పొలాలలో పని చేయడానికి పెద్దసంఖ్యలో భారత దేశం నుండి కార్మికులను తీసుకు వచ్చారు. 1834 – 1921 మధ్యలో ద్వీపంలో సుమారు 5 లక్షల మంది కార్మికులు పనిచేసారు. నేడు మారిషస్ జనాభాలో 68% కంటే ఎక్కువ మంది భారతీయ మూలానికి చెందిన వారు, సాధారణంగా ఇండో – మారిషియన్లు అని పిలుస్తారు. ప్రైవేటు వ్యవసాయ దారుల క్రింద కూలీలుగా పనిచేయటానికి 1835 లో కిష్టమ్, వెంకటపతి, అప్పయ్య అనే ముగ్గురు తెలుగు వారు కాంది శీకులుగా తొలిసారిగా మారిషస్‌లో అడుగు పెట్టారు. ఆ మరుసటి సంవత్సరం గౌంజన్ అనే ఓడలో దాదాపు 30 మంది తెలుగు వారు ఆ ద్వీపంలో కాలు పెట్టారు. కాకినాడ సమీపాన వున్న 'కోరంగి' రేవు నుండి బయలు దేరి వచ్చినందుకు వాళ్లని "కోరంగి వాళ్ళు" అని, వారు మాట్లాడే తెలుగు భాషకు 'కోరంగి భాష' అని పిలిచే



వారు. 1843 సంవత్సరంలో దాదాపు 35 ఓడల్లో భారతీయులు మారిషసు వలస వచ్చారు. వారిని తీసుకుని వచ్చిన ఓడల పేర్లు సిటీ ఆఫ్ లండన్, కింగ్ స్టన్, ఫ్లవర్ ఆఫ్ ఉగీర్, సుల్తాన్, సిరంగపట్నం, బాబా బ్రాహ్మిన్, కోరంగి పికెట్ మొదలైనవి. 1834లో పుట్టిన ఊళ్లను విడిచి, చెరుకు తోటల్లో పని చేసేందుకు కూలీలుగా మారిషస్ వెళ్లిన తెలుగు వారు మాత్రం తమ తరువాతి తరం వారు కూడా తెలుగు భాషను ప్రేమించి, మాట్లాడేలా పునాది వేశారు. మాతృ భాషకు బ్రహ్మోత్సవం జరిపారు. తెలుగుకు పట్టాభిషేకం చేస్తున్నారు. వారు తమతో తీసుకెళ్లిన వ్యవసాయ పరికరాలైన పలుగు, పారతో పాటు "పెద్ద బాలశిక్ష, రామాయణ, మహాభారతం" వంటి ఇతిహాస గ్రంథాలు, అక్కడి వారిని తెలుగు వారసులుగా తీర్చిదిద్దే ప్రయత్నానికి దోహద పడుతు న్నాయి. అవే ఇప్పటి ఆరవ తరం తెలుగువారూ భాషాయజ్ఞంలో మమేకం కావడానికి కొండంత ఆసరాగా నిలుస్తున్నాయి.

మారిషస్ దేశానికి వెళ్లిన తెలుగువారు తొలుత తమ భాషా, సాంప్రదాయాలను నిలుపు కోవడానికి ఇబ్బందులను ఎదుర్కొన్నా, అక్కడికి వెళ్లిన వారిలో మేబర్ ప్రాంతానికి చెందిన పండిట్ గుణ్ణయ్య 1930లో తెలుగు భాషా వికాసానికి నడుం కట్టారు. ఇలా 1947లో ముందు మారిషస్ ఆంధ్ర మహా సభ, తర్వాత నామాంతరం చెంది మారిషస్ "తెలుగు మహా సభ"గా ఆవిర్భవించింది. దాన్ని వారు తెలుగు భాషామ తల్లి ఆలయంగా భావిస్తున్నారు.. ప్రస్తుతం మారిషస్ దేశంలో తెలుగు కుటుంబాల్లో ఆరవ తరం వారు సైతం, తమ పెద్దలు వేసిన బాటలో నడుస్తుం డటం ఇక్కడి తెలుగు వారికి స్ఫూర్తిదాయక అంశం.

మారిషస్ దీవిలోని మొత్తం జనాభా దాదాపు 13 లక్షలైతే, తెలుగువారు 1లక్షమందికి పైగా ఉన్నారు. వీరికోసం సుమారు 300 తెలుగు పాఠశాలలు నడుస్తుండగా, 190 మంది అధ్యాపకులు పనిచేస్తున్నారు.
ప్రాథమిక తరగతులలో దాదాపు 10 వేల మంది విద్యార్థులు తెలుగు మాధ్యమంలో విద్యను అభ్యసి స్తున్నారు. మాధ్యమిక, ఉన్నత విద్య లో తెలుగు ద్వితీయ భాషగా ఉంది. ఉన్నత విద్యకోసం మహాత్మా గాంధీ విశ్వ విద్యాలయం పని చేస్తుంటే, తెలుగు మహాసభ, తెలుగు సాంస్కృతిక మండలి, తెలుగు యువ సంఘం, అనేక ఉప సంఘాలు సమన్వయంతో పని చేస్తున్నాయి. వీటికి మారిషస్ రిపబ్లిక్ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి, పూర్తిస్థాయిలో ఆర్థికంగా చేయూత నిస్తున్నది. ఫ్రెంచికి దగ్గరగా ఉండే "క్రియోల్" వారి మాతృభాష అయినా, స్వ భాషాభిమానంతో, తెలుగును ద్వితీయ భాషగా ఎంచుకొని తెలుగును బతికిస్తున్నారు. ముఖ్యంగా ధర్మపురి నరసింహ శతకం, వేమన శతక పద్యాలకు వారు పెద్దపీట వేయడం, క్షేత్రయ్య అన్నమయ్య, త్యాగయ్య, రామదాసు కీర్తనలు, నరసింహ శతకం, నేర్చుకోవడంతో పాటు తెలుగు సంప్రదాయాలనూ పూర్తిస్థాయిలో పాటించడం విశేషం. ఇటీవల అక్కడి విద్యార్థులే ఓ కథా సంకలనం వెలువరించడం వారికి తెలుగు గల అభిమానానికి, ప్రేమకు తార్కాణం.
మారిషస్‌లో ఓ ఆరాధ్య భావంతో తెలుగుకు బ్రహ్మోత్సవాలు 2018లో ఆగస్టు 20నుండి నిర్వహించి, అందులో భాగంగా, పద్య పఠన పోటీలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతి ప్రదానంతో పాటు ఒక్కోరోజు ఒక్కో తెలుగు సాంప్రదాయంపై అవగాహన కల్పించేందుకు వీలుగా సదస్సులను నిర్వహించారు.

మారిషస్ దీవిలో తెలుగు భాషోన్న తికి సర్వస్వాన్ని ఫణంగా పెట్టి "సంజీవ నరసింహ అప్పడు" పని చేస్తున్నారు. ఆయన ఆ దేశ తెలుగు పరీక్షల విద్యాధికారి, రేడియో వ్యాఖ్యాత, జర్నలిస్ట్. మారిషస్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ తెలుగు విభాగ అధికారి. తెలుగు ప్రాంతాలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ అక్కడి తెలుగు వికాసానికి కృషి చేస్తున్నారు. తెలుగుతనాన్ని నిలుపు కొనేందుకు మారిషస్ తెలుగు మహాసభ, అక్కడి ప్రభుత్వం గట్టి సంకల్పంతో పని చేస్తున్నాయి. తెలుగు మహాసభ దేశ రాజధాని పోర్టు లూయిస్ లోని రాయల్ రోడ్డులో ప్రధాన కార్యాలయం కలిగి, ఏడు ప్రాంతీయ కమిటీలు, 90 శాఖలు క్రియా శీలకంగా పని చేస్తున్నాయి అంటే, ఆ సంస్థ తెలుగు భాషాభివృద్ధికి చేస్తున్న కృషి చెప్పకనే చెబుతున్నది. తెలుగు వారికి ప్రీతి పాత్రమైన ఉగాదితో పాటు వినాయక చవితి, దీపావళి, సంక్రాంతి జాతీయ సెలవుదినాలుగా పాటించడం గమనార్హం. తెలుగు వారి సంస్కృతి ప్రతీకలైన పండగలు, పబ్బాలు ఆచరిస్తున్నారు. ప్రస్తుతం తెలుగువారిచే నిర్మితాలైన 350 దేవాలయాలూ తెలుగు భాషా వికాసానికి కేంద్రాలుగా ఉన్నాయి.

***రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494***

నినాదం
నిఖార్సైన జర్నలిజం
సాహితీ లహరి
శనివారం, ఫిబ్రవరి 21, 2026

# పవిత్ర జలం

మనం అందరి ముందు
నవ్వుపించాన్ని
ధైర్యంగా విప్పగలం

కన్నీటి చుక్కల్నెందుకో
రాల్చడానికి
భయపడుతుంటాం

ఏడుపంటే
ఎవరికి ఇష్టముండదు గాని
పుట్టుకతో తోడచ్చే
గొప్ప వరం ఏడ్వడం

చిన్నప్పుడు ఏడుపే
మన ఆకలికి చేయూత

ఏడుపు
బాధల్ని తగ్గించే ఔషధం
ఒంటరితనంలో
తోడిచ్చే స్నేహం
మనసుకంటిన
బాధల మరకలను
కడిగే సరుపు

అప్పుడప్పుడైన
ఏకాంతాన్ని
గుప్పిట్లో బంధిస్తుండాలి
బాధల మూటల్ని విప్పి
మనసారా ఏడ్చేయాలి

ఎంత కన్నీళ్ళను
ఖర్చుపెడుతామో
అంత ఆనందభాష్పాలను
ఆదా చేసినట్లే

నవ్వు ఏడుపులలో
ఏది గొప్పదంటే
ఏడుపే గొప్పదని
నిక్కచ్చిగా చెప్తాను

నవ్వు జల్లులు
మంచివి కావచ్చు
కన్నీటి చుక్కలు
పవిత్రమైనవి

**జాధవ్ అంబదాస్**
**9490231380**



## అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం
# గిరిజన మాతృభాషలు

— ఆచార్య భూక్య తిరుపతి

***జీవితంలో ప్రతి వ్యక్తికి మాతృభాష ఎంతో ప్రాముఖ్యమైనది. భాష ద్వారానే సంస్కృతి, సంప్రదాయాలను రక్షించుకుంటారు. భాషా ద్వారానే తన భావాలను, భావోద్వేగాలను తెలియపరచగలడు. మని షి పరిపూర్ణంగా వికాసం చెందడానికి, సాంస్కృతిక వారసత్వం కాపాడుకోవడానికి, సృజనాత్మకంగా ఆలోచించడానికి, సంబంధాలను బలపరచుకోవడానికి మాతృభాషా చాలా అవసరం. మాతృభాష అంటేనే అక్షయపాత్ర లాంటిది. మాతృభాష అంటేనే ప్రతి వ్యక్తి అస్తిత్వానికి ప్రతిబింబం. ఇది హృదయానికి దగ్గరగా ఉంటూ అద్దంలా పనిచేస్తుంది. నేడు ప్రపంచీకరణ మూలంగా ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాంతీయ భాషలు, గిరిజన భాషలు కనుమరుగవుతున్నా యి. పిల్లలు చిన్నప్పుడే మాతృ భాషలో కాకుండా పరభాషలో విద్య నేర్చుకోవడం మూలంగా సృజనాత్మకంగా ఆలోచించే స్థాయి కోల్పోతున్నారు.***

*1951 బంగ్లాదేశ్లో జరిగిన భాషా ఉద్యమం ఆధారంగా 1999 నవంబర్ 17వ తేదీన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం జరుపుకోవాలని యునెస్కో ప్రకటించింది. 2000 ఫిబ్రవరి 21వ తేదీన ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నాము. మాతృభాషా దినోత్సవం ముఖ్య లక్ష్యం భాష, సాంస్కృతిక సంప్రదాయాల అవగాహన కల్పించి మాతృభాషా వాడకాన్ని ప్రోత్సహించడం. ప్రతి సంవత్సరం యునెస్కో భాషా దినోత్సవానికి ఒక థీమ్ను ప్రకటిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా జరిపిన సర్వే ప్రకారం ప్రపంచంలోని దాదాపు ఆరువేల భాషలలో 40% నుండి 45% వరకు భాషలు అంతరించిపోతున్నాయని నివేదిక ద్వారా తెలుస్తుంది.*

మాతృభాషా దినోత్సవం ప్రారంభమైన 2000 సంవత్సరంలో 'అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ ప్రారంభ వేడుకలు' అనే థీమ్‌ను ప్రారంభోత్సవ సంవత్సరంలో తీసుకుంది. 2010 దశాబ్ది ఉత్సవాలను (International Year for the Rapprochement of cultures) రెండు దేశాల మధ్య లేదా రెండు సమూహాల మధ్య హృదయపూర్వక సంబంధాలు కలిగి ఉండే థీమ్‌ను సూచించింది. 2020లో ద్విదశాబ్ది ఉత్సవాలను (safeguarding linguistic diversity) భాషా వైవిధ్యములో భాగంగా భాషల వ్యాప్తి, భాషా మాండలికాలు, వర్గీకరణ మాతృభాష మాట్లాడే ప్రాంతాలు, ప్రాంతీయ సమూహాలు, ప్రపంచ వ్యాప్తంగా మాట్లాడే భాషలను రక్షించే బాధ్యత థీమ్‌గా సూచించింది. 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 2025లో 'అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం రజతోత్సవ వేడుకలు' అనే థీమ్‌ను తీసుకొని ఘనంగా జరుపుకున్నది.

2026వ సంవత్సరపు థీంగా Youth Voices on Multilingual Educationను ప్రకటించింది. బహుభాషలలో విద్యను ప్రోత్సహించడం కొరకు బహుభాష విద్యపై యువత స్వరాలు అనే అంశంపై దృష్టి సారించింది. మాతృభాష/స్థానిక భాషలో విద్య ద్వారా తమ మాతృభాషను రక్షించుకోవచ్చు అనేది యునెస్కో ఆలోచన. ఇప్పటివరకు దాదాపు ఇరవై ఆరు థీమ్‌లను యునెస్కో ప్రకటించింది. ఇందులో కొన్ని థీములలో Endangered Languages గురించి కూడా ప్రస్తావించింది. భారతదేశంలో అనేక ఆదివాసి గిరిజన తెగలు ఉన్నాయి. ఒక్కొక తెగ ఒక్కో భాష మాట్లాడుతుంది. వారు తమ భాషను మౌఖికంగా తరతరాలుగా కాపాడుకుంటూ వస్తున్నారు. వారి భాషలు ఎదుర్కొంటున్న సమస్యలు మరి కొన్ని సంవత్సరాలలో అంతరించే స్థాయికి చేరుకున్నాయి. ఎందుకంటే ఆదివాసి గిరిజనుల భాషలు (State less Languages) రాష్ట్రంలేని భాషలు. తాము నివసిస్తున్నటువంటి రాష్ట్రంలో ప్రాంతీయంగా అమలులో ఉన్న భాషలో చదువుకుంటున్నారు. అదే భాషలో మాట్లాడుతున్నారు.

ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులు, నేటితరం యువకులకు ఉపాధి అవకాశాల కోసం తప్పనిసరిగా ప్రపంచాన్ని శాసిస్తున్న భాషను కూడా నేర్చుకోవాల్సిన అవసరం ఏర్పడుతున్నది. అందువల్ల తమ మాతృభాషతో అలాగే తాము నివసిస్తున్నటువంటి రాష్ట్రంలోని ప్రాంతీయ భాషతో క్రమక్రమంగా నేటి తరం దూరమవుతున్నారు. కుటుంబ పెద్దలు వయోభారం మూలంగా కుటుంబాటకు దూరం అవుతున్నారు. తరతరాలుగా మౌఖికంగా కాపాడుకుంటూ వస్తున్న ఆదివాసి గిరిజన భాషలు, స్థానిక భాషలు పూర్తిగా అంతరించిపోయే ప్రమాదం కనిపిస్తున్నది. ముందుగా సమాజంలో చిన్నచిన్న భాషలు త్వరగా కనుమరుగయ్యే అవకాశం ఉంటుంది. భాషలు కనుమరుగైతే మన సంస్కృతి, మన సంప్రదాయాలు అన్ని అంతరించిపోతాయి.

2019వ సంవత్సరాన్ని యునెస్కో అంతర్జాతీయ స్థానిక భాషల సంవత్సరంగా ప్రకటించింది. దీనిని మనం భారతదేశంలో ఉన్న గిరిజన భాషలకు అన్వయం చేసుకుంటే భారతదేశంలో అంతరించిపోతున్నటువంటి ఆదివాసి గిరిజన భాషలు అనేకం ఉన్నాయని చెప్పవచ్చు. భారతదేశ వ్యాప్తంగా నేడు ప్రమాదంలో ఉన్న భాషలు దాదాపుగా 200 వరకు ఉన్నాయని తెలుస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో కూడా కొన్ని భాషలు కనుమరుగైనట్లుగా The linguistic survey of India పేర్కొన్నది. ప్రమాదానికి గురవుతున్నటువంటి భాషలు ఆదివాసి గిరిజన భాషలే అయి ఉండవచ్చునని నా అభిప్రాయం.

దీనికి ప్రధాన కారణం ఆదివాసి గిరిజన విద్యార్థులు తెలుగు/ఆంగ్ల మాధ్యమంలో చదువుకోవడం, ఉద్యోగ, వ్యాపార రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడడం, వారి మాతృభాషకు సంబంధించినటువంటి ప్రసార సాధనాలు లేకపోవడం, ఇంట్లో ఉన్నప్పుడు కూడా మాతృభాషలో మాట్లాడలేకపోవడం అని భావించవచ్చు. భాష కనుమరుగు కావడం వల్ల ఆ జాతి సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, పాటలు, ఐతిహ్యాలు, కవిత్వం అలాగే సమస్తసాహిత్యం కనుమరుగవుతుంది.

**పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలు:**

1.ఆదివాసి గిరిజనులు నివసిస్తున్న ప్రాంతాల్లో వారి మాధ్యమంలోనే విద్యను అందించడం.

2. ఇంట్లో తప్పకుండా వారి మాతృభాషలోనే మాట్లాడుకోవడం.

3. వారు ఏ ప్రాంతంలో నివసిస్తున్నా కనీసం పర్వదినాల్లోనైనా సాంస్కృతిక అంశాలు ప్రతిబింబించే విధంగా తయారవ్వడం.

**ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలు:**

అంతరించిపోతున్న ఆదివాసి గిరిజన మైనారిటీ భాషలను రక్షించడానికి భారత రాజ్యాంగంలో ఉన్న నిబంధనలను ఆధారంగా చేసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంతరించిపోతున్న భాషలను కాపాడడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటే బాగుంటుంది. అవి ఆదివాసి గిరిజనులకు సంబంధించిన భాషకు నిఘంటువులు తయారుచేయడం. వారి భాషలోని మాండలికాలను గుర్తించడం, విశ్వవిద్యాలయాల్లో తప్పనిసరిగా ఆదివాసి గిరిజన తెగల శాఖలను ఏర్పాటు చేసి ఆయా భాషలు, మౌఖిక సాహిత్యాన్ని గ్రంథస్తం చేయడం, భద్రపర్చడం.

వారి భాషలో రాస్తున్న కవిత్వాన్ని, కవులను కళాకారులను ప్రోత్సహించడం, సాహిత్యాభివృద్ధికి కృషి చేయడం, ఆదివాసి గిరిజన సాహిత్య అకాడమీ స్థాపించడం, మానవీయ శాస్త్రాలలో ఆదివాసీ గిరిజనుల సిలబస్‌ను చేర్చడం, ప్రతి సంవత్సరం ఆదివాసి గిరిజన దినోత్సవాన్ని ప్రభుత్వాలే తప్పనిసరిగా జరపడం, మొదటి తరగతి నుండి డిగ్రీ స్థాయి వరకు తెలుగు మాధ్య మాలలో తెలుగు వాచకాలలో ప్రతి తరగతిలో ఆదివాసి గిరిజనులకు సంబంధించిన సంస్కృతి, భాషా సాహిత్యాలను పొందుపరచడం. ప్రసారమాధ్యమాలైన సోషల్ మీడియా, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలో గిరిజన ఆదివాసి తెగలకు సంబంధించిన విషయాలు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిరోజు ఒక గంట పాటు ప్రసారం చేయడం. ప్రింట్ మీడియాలో వారంలో ఒకరోజు కొన్ని ఆదివాసి గిరిజనులకు సంబంధించిన భాషలు, సాహిత్య విషయాలను ప్రింట్ చేసే విధంగా ఆదేశాలు ఇస్తే, ఆదివాసి గిరిజనులకు సంబంధించిన భాషలు, సాహిత్యం, సంస్కృతి తరతరాలుగా మౌఖికంగా కాపాడుకుంటూ వస్తున్న వాటిని భవిష్యత్ తరాలకు అందించడానికి ఉపయోగపడుతుందని, అలాగే సమాజానికి వారి గురించి తెలుస్తుందని నా అభిప్రాయం.

**ఆచార్య భూక్య తిరుపతి**
తెలుగుశాఖ,
హైదరాబాద్ విశ్వవిద్యాలయం
హైదరాబాద్ - 500046
సెల్: 9441335123



## బహుభాషా విద్యపై
# యువత దృష్టి పెట్టాలి !

ప్రజలను ఏకం చేసే బలమైన సాధనం భాష మాత్రమే. ప్రపంచ ప్రజలను ఏకం చేస్తూ, ప్రజలతో విడదీయరాని బంధాన్ని భాష పెనవేసుకున్నది. భాష ఆ ప్రాంత సంస్కృతికి అద్దం పడుతున్నది. ప్రపంచవ్యాప్తంగా 8,324 భాషలు ఉన్నాయని, అందులో 7,000 భాషలు నేటికీ వినియోగంలో ఉన్నాయని యునెస్కో అధ్యయనం వెల్లడించింది. వీటిలో దాదాపు 43 శాతం భాషలు అంతరించే స్థిలో, 40 శాతం భాషసల్లో విద్యాబోధన జరగడం లేదు, కొన్నింటికి లిపి కూడా లేకపోవడం గమనార్హం. సువిశాల భారతంలో రాజ్యాంగ పరంగా 22 అధికార భాషలు ఉండగా, మాట్లాడే భాషలు/యాసలు 1,600ల వరకు ఉన్నాయి. ఇలాంటి భాషా వైవిధ్యత కు పుట్టినిల్లుగా ఉన్న భారతం భాషా వారసత్వ కేంద్రంగా భాసిల్లుతున్నది. ప్రతి రెండు వారాలకు ఒక భాష అంతరించిపోతున్నట్లు యునెస్కో వెల్లడించడం విచారకరం. ప్రతి మాతృ భాషను తల్లిలా కాపాడుకోవడం మన కనీస ధర్మం.

**అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం-2026:**

ప్రపంచ భాషలను కాపాడుకోవడం, వినియోగంలోకి తేవడం, అంతరించిపోకుండా చూసుకోవడం లాంటి లక్ష్యాలతో ప్రతి ఏట 21 ఫిబ్రవరిన ఐరాస సభ్య దేశాలు "అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం లేదా ఇంటర్నేషనల్ మదర్ లాంగ్వేజ్ డే" పాటించడం 1999 నుంచి ఆనవాయితీగా మారింది. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం–2026 ఇతివృత్తంగా "బహుభాషా విద్యపై యువత గళమెత్తాలి" అనే అంశాన్ని తీసుకొని విస్తృతమైన ప్రచారం చేస్తున్నారు. భాషా వైవిధ్యం, బహుభాషావాదాన్ని ప్రోత్సహించడం లాంటి ప్రాధాన్యతలతో గత 26 ఏండ్లుగా ఐరాస నాయకత్వంలో భాషా పరిరక్షణ ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. ప్రపంచ భాషా పరిరక్షణ చర్యల్లో భాగంగా 2022–32 దశాబ్దాన్ని "అంతర్జాతీయ స్వదేశీ (గిరిజన) భాషల దశాబ్దం"గా ప్రకటించిన పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నది ఐరాస.

**బంగ్లాదేశ్‌లో మాతృభాష ఉద్యమం-1952 :**

1947లో సువిశాల భారత విభజన సమయంలో వెస్ట్ (బంగ్లాదేశ్) పాకిస్థాన్, ఈస్ట్ పాకిస్థాన్‌లు విడిపోయి ఒకే పాకిస్థాన్‌గా ఏర్పడ్డ విషయం మనకు తెలిసిందే. నాటి పాక్ ప్రభుత్వం రెండు ప్రాంతాలకు ఉర్దూ ఏకైక అధికారిక భాషగా నిర్ణయించడంతో బంగ్లా మాతృభాష మాట్లాడే ప్రజలు నిరసన ప్రదర్శనలు చేయడంతో 21 ఫిబ్రవరి 1952న పోలీసు జరిపిన కాల్పుల్లో నలుగురు మరణించడం జరిగింది. మాతృభాష పరిరక్షణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఏట 21 ఫిబ్రవరిన "అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం" నిర్వహించుకోవడం 1999 నుంచి ఆనవాయితీగా మారింది.

**మాతృభాష ప్రాముఖ్యత:**

అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం వేదికగా భాషాభివృద్ధి సదస్సులు, బహుభాషావాదాన్ని ప్రోత్సహించడం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం, భాషలు అంతరించకుండా జాగ్రత్త పడటం, భాషా పోషకులను గుర్తించడం లాంటి కార్యక్రమాలను నిర్వహించాలి. మాతృభాషలో చదివితే సులభంగా నేర్చుకోవడం, సృజనాత్మకతను ప్రదర్శించడం జరుగుతుంది. మాతృభాషతో ప్రజల్లో సమ్మిళిత ఐక్యత, సామాజిక–భావోద్వేగ అభివృద్ధి, సాంస్కృతిక గుర్తింపు, లింగ సమానత్వం, విలక్షణ ఆలోచనలతో ఆవిష్కరణలు, విషయ పరిజ్ఞానం లాంటివి పెరుగుతాయని మనకు తెలుసు. నేడు దాదాపు 40 శాతం విద్యార్థులు మాతృభాషను వదిలి ఇతర భాషల్లో విద్యాభ్యాసం చేయడం చూస్తున్నాం.

మాతృభాష అమ్మ రొమ్ముపాలంత తియ్యన. మాతృభాషను చులకన చేస్తే అమ్మను హేళన చేసినట్లే. మాతృభాషను గుండెల్లో పెట్టుకొని కాపాడుకోవడం, మాతృభాషలో విద్యాభ్యాసం చేయడం, మాతృభాష అభివృద్ధికి ఆజ్యం పోయడం లాంటివి నిరంతరం జరుగుతూనే ఉండాలి. మాతృభాషలో మాట్లాడితేనే చిన్నచూపు చూసే విపరీతమైన బుద్ధులు పుట్టుకురావడం సోచనీయం. "ప్రపంచ భాషలందు మాతృభాష లెస్స" అంటూ నినాదాలు చేద్దాం. మాతృభాషను ఆత్మగా గౌరవిద్దాం, అమ్మ ముచ్చట్లను తేనె మూటలుగా ఆదరిద్దాం.

**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి,**
**9949700037**



## అంతరించి పోతున్న
# భాషల జాబితాలో పైడి భాష

***ఇండో ఆర్యన్ భాషా కుటుంబానికి చెందిన ఒరియా భాషకు జన్యభాషే ఈ పైడి భాష. పర్లాకిమిడి సంస్థానం రాజావారైన ప్రతాపరుద్ర గజపతి నారాయణ దేవుడు సంగీత, సాహిత్యాలనుపోషించేవాడు. ముఖ్యంగా ఒరియా, సంస్కృత భాషలను ఆదరించేవాడు. ఒడియాలో కొన్ని పల్లెటూర్లలో సామాన్య ప్రజలు పైడి భాషను మాట్లాడుతుంటారు. వీరినే పైడి (డోమ్, వొడ్డుశాలులు) అని అంటారు. చేనేత, సంగీతం వీరి ప్రధాన వృత్తిగా ఉండేది. ప్రస్తుతం చేనేత వదిలేసి సంగీత ఉపాధినే చేస్తున్నారు. కాని ఈ భాషకు లిపిలేదు. పూర్వం నుండి ఇప్పటి దాకా ఈ భాషను కాపాడుకుంటూ వస్తున్నారు. ఒరియా భాషకు దగ్గరగా ఉన్న ఈ పైడి భాషలో సంస్కృతం, తెలుగు, ఒరియా తత్సమాలు చాలా కనిపిస్తాయి. ఒరియా, పైడి భాషలకు సామ్యం ఉన్నా, ఒరియా పదాలలో సాగదీత అధికంగా ఉంటుంది. పైడి భాషా నిర్మాణంలో పదాలు తేల్చి పలకడం కనిపిస్తుంది.***

***తి కీ కమొ హెల్లే కొరుచీస్కి? - ఒరియా భాష***
***(దీర్ఘాంతాలు) కొరుచీస్కి - కొరు+చ్+ఈ+స్+క్+ఈ***
***ఇందులో దీర్ఘాచ్చులే ఉన్నాయి. " కొరు" లో " కొ " దంత్యంగా ఉంది.***

***తి కాయ్ పటి హెల్లె కెరుచిస్కి?- పైడి భాష (హ్రస్వాంతాలు)***
***కెరు+చ్+ఇ+స్+క్+ఇ ఇందులో హ్రస్వాచ్చులే ఉన్నాయి." కొరు" అనేది ఒరియాలో దంత్యంగా కనిపిస్తుంది. "కొరు"లోని "క"కారం తాలవ్యంగా మారి "కెరు"గా రూపాంతరం చెందింది.***
***నువ్వు ఇప్పడు ఏదైనా పని చేస్తున్నావా?-తెలుగు***

దీనికి కారణం ఒడియా సరిహద్దు ప్రాంతంలోని ప్రజలు ఆంధ్రప్రదేశ్ కి వలస వచ్చేసారు. తెలుగు ప్రభావం వల్ల పైడి భాషలో సాగదీత పోయి, దీర్ఘాంతాలు హ్రస్వాంతాలుగా మారిపోయాయి. పైడి భాషను మాట్లాడేవారు ముఖ్యంగా కళింగాంధ్ర ప్రాంతాలైన విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఉన్నారు. అలాగే ఒడియా సరిహద్దుప్రాంతాలైన డిమిలి, కర్జాడ, గురండి, గౌడు తాల్సింగ్, రతన్తాల్సింగ్, గోరిడి వంటి గ్రామాల్లో ఈ పైడి భాష మాట్లాడేవారు కనిపిస్తారు. లిపి లేకపోయినా పైడి భాషలో సాహిత్యం పుష్కలంగా ఉంది.

*"సడల కన్యకే పడల చింతకైకె!"*
*- విడిచిపెట్టిన దానికోసం ఆలోచన ఎందుకు!"*
*కలా ముం బైజ్ బజావ్ నో"*
*చెవిటి వాడి ముందు శంఖం ఊదడం."*
*సారు నొయిల డబు కెత్తికి రొయిలే సోజ్ కైటా?"*
*చెల్లని డబ్బు ఎంత వున్నా ప్రయోజనం ఏమిటి?*

*ఒక ఇడ్లీ కొట్టువాడి చమత్కార కవిత*
*గొట్కె కైలె మోన్ భంగతై ! / దిటె కైలె పేట్ పుర్తై !*
*తింటె కైలె చౌల్ మిల్తై ! / అసాగో మా! అవ్ మిలి నై!/ సురాగిలీ యా!*
*ఒకసారి తింటే మనసు నిండిపోతుంది!*
*రెండోసారి తింటే కడుపు నిండిపోయింది!*
*మూడవసారి తింటే ఇంట్లో బియ్యం మిగులుతుంది!*
*రండమ్మా రండి! అయిపోతే దొరకదు!*

పై చదువులు చదవడానికి వెళ్ళే పైడి విద్యార్థులకు అస్తిత్వానికి సంబంధించిన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇటువంటి భాష ఎక్కడైనా ఉంటుందా? పైడి అనేది ఏ విధమైన కులం అనే ప్రశ్నలకు సమాధానం మాతృభాష ఒక్కటే పరిష్కారం. పైడి వాళ్ళు వారి భాషపై పటుత్వం సంపాదించిన రోజున ఎవరు కూడా ప్రశ్నించాలేరు.

**కోట విజయ్ కుమార్**
**- హైదరాబాద్ విశ్వవిద్యాలయం**



## మర్యాదగానే ఉంటది!

ఇలా అడ్డా మీద కూలీ కోసం
గుంపులో నిలబడ్డం మర్యాదగానే
ఉంటది రెక్కల కష్టంతో సంపాదించిన నాలుగు కూలీ డబ్బులతో
కలో గంజో తాగి కాల్వ పక్కన
గుడిసెలో పడుంటే వచ్చే నిద్ర
సుఖంగానే ఉంటది

ఒక్కరోజు సభకు ఎవడో ఇచ్చే ఉచిత
సారాసీసా, బిర్యాని పొట్లం కన్నా
వాడు అందలం ఎక్కాక ఇచ్చే
ఉచితాల కన్నా
నెత్తికి మురికి రుమాలు చుట్టుకొని,
భుజం మీది చిరుగుల తుండుగుడ్డను
ఒక్కసారి గర్వంగా దులిపి తిరిగి
భుజం మీద కప్పుకోవడంలో ఎంత
పొగరుంది!

మేస్త్రీ పనో, ఇటుకలెత్తే పనో,
రోడ్లూడ్చే పనో, చెత్త ఎత్తే పనో
షావుకారు దుకాణంలో బస్తాలు
వీపు మీద మోసే పనో, ఏదైతేనేం పని
పనే కదా!

పని పొగరు నా నెత్తి మీద రుమాలుకు
నెమలీకల రంగులద్ది నాట్యమాడుతది
ఖాళీ కడుపు మీద, కాలే గుండె మీద
కాలు ముడుచుకొని కూర్చున్నప్పుడు
చెమట చుక్కలో, కన్నీటి చుక్కలో
బతుకు దాహాన్ని ఆర్పుతూ ఉంటే
బానిస బతుకు కన్నా రోడ్డు
పక్కన పేవ్‌మెంట్ మీద కూచొని
దుమ్ము దుప్పటి కప్పుకొని
అన్నప్రసాదాలెవరైనా పెడతారేమోనని
ఎదురుచూడ్డం గౌరవంగానే ఉంటది

ఎదురుగా ఉన్న గొప్ప చరిత్రను,
అభివృద్ధిని రోజూ నెమరేస్తూ
కొద్దికొద్దిగా చావడంకన్నా
ఏమీ లేనితనం ఎందుకని
కూలీ వాడి శవాన్ని మోసే కూలీ
వాడికి పనైనా దొరికినందుకు సంతోషంగానే ఉంటది.

**— డా. రూప్ కుమార్ డబ్బీకార్**
**9177857389**